# వాడు నాకేమవుతాడు?

కొరుక్కుతినే చలి, బయట వర్షం.

చలిగాలి, గాలివాన — రెండూ కూడబలుక్కున్నాయి. ఒక దానితో ఒకటి పోటీ పడుతున్నాయి. కిటకిటలాడి పోతూంది మూడవ తరగతి కంపార్టుమెంటు. చలికి తట్టుకోలేక, వీలుని బట్టి సర్దుకుని ఎలాగో కునికిపాట్లు పడుతున్నారు జనం.

ఈదురుగాలి, చలి, నిద్ర, వర్షం— దాదాపు రెండు గంటలనుంచీ ఒంటి కాలిమీద నిలబడి ఉన్నాడు అతను. కనీసం నిలబడడానికికూడా చోటు లేదు. అతి కష్టంమీద ఆమెకు కూర్చోడానికి స్థలం ఇప్పించగలిగాడు. చాలా చిరాకుగా ఉంది. మనస్సు మనస్సులో లేదు. మనిషిలో పశ్చాత్తాపం. తనమీద తనకే జాలి. అంతలోనే, తన పొరపాట్లను ఎత్తి చూపించిన మనుష్యుల మీద కసి. అంతులేని ఉక్రోషం. తనమీద తనకే అసహ్యం.

ఎవరో తరుముకు పోతున్నట్లుగా పరుగెత్తుతూంది రైలు. గతంచేత తరమబడుతున్నాడు తను. కాకపోతే దానికి గమ్యం ఉంది. మరి తనకో! మిగిలింది అగమ్యం. తప్పులతడికలాగా కనిపిస్తున్న అతని గతానికీ, నమ్మకంలేని భవిష్యత్తుకూ మధ్య త్రిశంకుస్వర్గంలా వేలాడుతూంది అతని మనస్సు ప్రస్తుతం. చెట్టులూ, పుట్టలూ, ఊర్లూ, పొలిమేరలూ మింగుతూ పోతూంది రైలు. కిటికీలోంచి బయటికి చూశాడు. ఏదో 'బ్రిడ్జి' మీదగా పోతూంది. క్రింద పెద్ద ప్రవాహం. అతని మనస్సు గతాన్ని చూస్తూంది.

ఆ నాడు తనూ, వాడూ ఏట్లో ఈతలకు పోయారు. ఈ ఒడ్డునుంచి ఆ ఒడ్డుకు పోవాలి. ఆ రోజుల్లో అదొక ఘనకార్యం. ఇద్దరిదీ నూనూగు మీసాల నూతన యౌవనం. మూడు వంతులు వెళ్ళేసరికి ఇద్దరికీ ఊపిరి వచ్చేసింది. కాళ్ళూ, చేతులూ తేలిపోతున్నాయి. గుండె లవిసిపోతున్నాయి. గమ్యం చేరుకోలేమేమో అన్న అనుమానం దూరాన్ని ఎక్కువ చేస్తూంది. బ్రతుకుమీద ఆశ పోయింది తనకు. పిరికితనం పాతాళానికి తొక్కే



